-9 NOV 2020 ENADU

## తీరంలో సందర్శకుల సందడి

యానాం, న్యూస్‌టుడే: కొవిడ్ వైరస్ తీవ్రత తగ్గుతుండడంతో పర్యాటక కేంద్రం యానాంలో సందడి మొదలైంది. రాజీవ్ బీచ్‌లో ఆదివారం సాయంత్రం సందర్శకుల సంఖ్య పెరిగింది. కిలోమీటరు మేర నిర్మించిన వాక్‌వేలో జనం కూర్చుని ప్రకృతి అందాల్ని ఆస్వాదిస్తూ కనిపించారు.



రాజీవ్‌బీచ్‌లో సందర్శకులు

**యానాం:** ప్రభుత్వ కళాశాలలు, ఎయిడెడ్ కళాశాలల్లో ఇంటర్ చదివే విద్యార్థులకు మెడిసిన్, డెంటల్ కోర్సుల్లో 10 శాతం అంతర్గత రిజర్వేషన్ ఇవ్వాలన్న పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతిపాదనకు లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ ఆమోదించారు. ఈ విద్యాసంవత్సరం నుంచే ఉత్తర్వులు అమలు చేసేలా గజెట్ ద్వారా ప్రకటిస్తామని సీఎం నారాయణసామి పేర్కొన్నారు.

-9 NOV 2020

ANDHRA JYOTHI

## కొవిడ్ బాధితుల రికవరీ రేటు 95.06 శాతం

యానాం, నవంబరు 8: పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా కొవిడ్ బాధితుల రికవరీ రేటు 95.06శాతంగా ఉందని ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆరోగ్య శాఖ బులిటెన్‌లో వివరాలను వెల్లడించారు. ఇప్పటివరకు పుదుచ్చేరిలోని నాలుగు రీజియన్స్‌లో మొత్తం 35,838 పాజిటివ్ కేసులు నమోదు కాగా 34,067మంది డిశ్చార్జి అయ్యారన్నారు. 1,170 యాక్టివ్ కేసులు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 3,37,714మందికి పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. కొవిడ్ కేసులు తగ్గుతున్నా ప్రజలు మాత్రం అప్రమత్తంగా ఉండాలన్నారు.

29 NOV 2020 SAKSHI

# మత్స్యకారులకు 'సిరి'మేను

## చీరమేను కొనేందుకు పోటెత్తిన జనం..

యానాం: ఆ ప్రాంతంలో కారులు బారులు తీరాయి..మరో పక్క జనసందోహం..అందరూ ఏదో జరుగుతుందని భావించారు. తీరా అక్కడికి వెళితే చీరమేను కోసం జిల్లా పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చారని తెలియడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక గౌతమీగోదావరి వద్ద పుష్కరఘాట్ సమీపంలో చీరమేను కొనేందుకు జనం కిటకిటలాడారు. ప్రస్తుత సీజన్‌లో చీరమేను ఎక్కువగా పడుతుందని ధర కూడా కొనేవిధంగా ఉందని తెలియడంతో జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి ఖరీదైన కారుల్లో సైతం వచ్చి వాలిపోయారు. స్థానిక పుష్కరఘాట్ సమీపంలో చీరమేనును మార్కెట్‌లోనికి తీసుకురాకముందే వేలం పాట నిర్వహిస్తుంటారు. దీంతో పలువురు వేలంపాట ద్వారానే చీరమేనును దక్కించుకునేందుకు పోటీపడ్డారు. చీరమేనును శేరు, తవ్వ, బకెట్, క్యారేజీ, బిందె కొలతల్లో అమ్మడంతో లక్షలాది రూపాయల మేర వ్యాపారం జరగడంతో మత్స్యకారులకు కాసుల పంట పండింది. ముఖ్యంగా చీరమేను సముద్రం, నదీ కలిసే సీమౌత్ వద్ద ఎక్కువగా దొరుకుతుంటుంది. అదేవిధంగా తూర్పు నుంచి వేసే చల్లని సముద్రపు గాలులకు చీరమేను ఉపరితలంపైకి వస్తుంటుంది.



గౌతమీగోదావరి వద్ద చీరమేను కోసం వచ్చిన జనసందోహం



చీరమేను కొనుగోలు చేస్తున్న మాంసాహార ప్రియులు

**ధరలు ఇలా..**

బిందె చీరమేను రూ.16వేలు, బిందె పరిమాణం బట్టి రూ.12 వేలు, రూ.10వేలు వరకు ధర పలకడంతో మత్స్యకారులకు కాసుల పంట పండినట్లయ్యింది. సీజన్‌లో ఒకసారే దొరికే చీరమేను కోసం మాంసాహార ప్రియులు ఎదురుచూస్తుంటారు.ఒక్కసారైనా రుచి చూడాలని భావిస్తుంటారు.

---



యానాం-ఎదుర్లంక వారధిపై మట్టి తొలగింపు పనులు చేస్తున్న దృశ్యం

# యానాం-ఎదుర్లంక వారధిపై మట్టి తొలగింపు

సాక్షి ఇంపాక్ట్

యానాం: యానాం-ఎదుర్లంక బాలయోగి వారధి నిర్వహణలో అలసత్వాన్ని తెలియజేస్తూ 'వారధి ఇలా...ప్రయాణించేదెలా..' అనే శీర్షికన ఆదివారం సాక్షిలో వచ్చిన కథనానికి నేషనల్ హైవే అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి 1800 మీటర్ల పొడవునా పేరుకు పోయిన మట్టిని తొలగించడంతో పాటు పుట్‌పాత్‌పై పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకు పోయిన వ్యర్థాలు, నాచు తదితరమైన వాటిని తొలగించే పనులను ప్రారంభించారు. వర్షం వస్తే బ్రిడ్జి పైభాగం కాస్తా వర్షపు నీటితో నిండిపోతుంది. వర్షపు నీరు వెళ్లేవిధంగా నిర్మించిన రంధ్రాలు భారీ ఎత్తున మట్టితో మూసుకుపోవడంతో నీరు వెళ్లడం లేదు. అదేవిధంగా పుట్‌పాత్‌పై పాదచారులు కనీసం నడవలేని పరిస్థితి నెలకొనివుంది. పిచ్చిమొక్కలతో గుబురుగా ఉండటంతో అటు వెళ్లడానికి పాదచారులు భయపడుతున్నారు. కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మించిన వారధిని కాపాడాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

---

## కోవిడ్ రికవరీ రేటు 95.06 శాతం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా కోవిడ్ బారిన పడి చికిత్సపొంది ఆరోగ్యవంతంగా డిశ్చార్జ్ అవుతున్న రేటు 95.06 శాతంగా ఉందని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు పుదుచ్చేరిలోని నాలుగు రీజియన్‌లైన పుదుచ్చేరి, యానాం, కారైకల్, మాహే ల్లో మొత్తం 35,838 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని 34,067 మంది డిశ్చార్జి అయ్యారని, 1,710 యాక్టివ్ కేసులు ఉన్నాయన్నారు. ఆదివారం యానాంలో 5, పుదుచ్చేరిలో 69, మాహేలో 16, కారైకల్‌లో 5 కేసులు కొత్తగా నమోదయ్యాయని ఆయన తెలిపారు.

## 'ఎల్జీని కలవడంలో అంతర్యం ఏమిటో చెప్పాలి'

యానాం: పుదుచ్చేరిలో కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతునిస్తూ కూటమిలో కీలకంగా ఉన్న డీఎంకే ఎమ్మెల్యేలు, నేతలు ఎల్జీ కిరణ్‌బేడీని ఎందుకు కలిశారో ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత ఉందని శాసనసభలో ఏఐఏడీఎంకే పక్షనేత అన్బళగన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వంపై అంసతృప్తి ఉందా అన్ని ప్రశ్నిస్తూ, ఎల్జీని కలవడంలో అంతర్యం ఏమిటో బయటపెట్టాలని డీఎంకే నేతలను కోరారు. ఎమ్మెల్యేలు స్వీయ అవసరాల కోసం కలిశారా, ప్రజాసమస్యలపై కలిశారో చెప్పాలన్నారు.

## వ్యక్తి అదృశ్యం



రాధాకృష్ణ(ఫైల్)

యానాం: పట్టణ పరిధిలో హైస్కూల్ రోడ్డులో నివాసం ఉంటున్న క్షత్రియ రాధాకృష్ణ(55) అనే వ్యక్తి అదృశ్యంపై ఆదివారం కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం రాధాకృష్ణ ఇంటినుంచి బయ టకు వెళ్లి మళ్లీ తిరిగిరాలేదని, అదృశ్యమైన వ్యక్తి లైట్‌కలర్ చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడని ఎస్సై కట్టా సుబ్బరాజు తెలిపారు. వివరాలు తెలిస్తే ఫోన్ నంబర్లు: 0884-232 1233, 888522 29822కు తెలియజేయాలని కోరారు.